నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, బుధవారం 14 ఆగస్టు 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



వనపర్తి జిల్లా దవాఖానలో వివిధ చికిత్సల కోసం టోకెన్లు తీసుకుంటున్న జనం

# వైద్యం.. దైన్యం!

'నమస్తే' విజిట్



నాగర్‌కర్నూల్ దవాఖానలో ఓపీ కోసం గుమికూడిన రోగులు

## ఖాళీల భర్తీ ఎప్పుడు?

- 218 పోస్టులకుగానూ 153 ఖాళీలు
- వనపర్తి దవాఖానకు పోటెత్తుతున్న వ్యాధిగ్రస్తులు
- మందులను బయటకు రాస్తున్న వైనం
- ల్యాబ్ సేవల కోసం మూడు రోజులపాటు పడిగాపులు

వనపర్తి, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లా దవాఖానలో వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తున్నది. వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకపోవడంతో రోగులకు సరైన వైద్యసేవలందడం లేదు. మొత్తం 218 పోస్టులకుగానూ 65 మంది మాత్రమే విధులు నిర్వర్తిసున్నారు. 153 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పక్షం రోజులుగా ఏ దవాఖానలో చూసినా జ్వర వ్యాధిగ్రస్తులతో నిండిపోతున్నాయి. వనపర్తి జిల్లా దవఖానకు నిత్యం 500 నుంచి 800 మంది వరకు రోగులు వస్తున్నారు. 450 పడకలతో ఉన్న ఈ దవాఖానకు రోగుల తాకిడి పెరిగింది. సాధారణ జ్వరాలతోపాటు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి కేసులు వస్తున్నాయి. జిల్లాలోని పది గ్రామాల్లో డెంగీ వ్యాధి లక్షణాలున్న వారిని గతంలో వైద్య శాఖ గుర్తించింది. అయితే, జూలై నుంచి ఐదు డెంగీ కేసులను మాత్రమే గుర్తించగా.. మిగిలిన కేసులు అంతకుముందున్న నెలల్లో నమోదయ్యాయి. అలాగే, వానకాలం సీజన్‌కు ముందే మదనాపురం మండలం దంతనూరు గ్రామంలో చికున్‌గున్యాకు కేసు నమోదైంది. అక్కడ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వ్యాధి నివారణ చర్యలు చేపట్టారు. వ్యాధులను గుర్తించిన గ్రామాల్లో దోమల నివారణ, మందుల పిచికారీ వంటి ముందస్తు చర్యలు తీసుకున్నారు. అయితే, అనధికారికంగా డెంగీ, చికున్‌గున్యా కేసులు అధికంగా నమోదవుతున్నట్లు సమాచారం. సర్కార్ దవాఖానల్లో ఈ రోగుల అలికిడి కనిపించక పోగా.. రోగులంతా ప్రైవేట్ దవాఖానలకు క్యూ కడుతున్నారు.

**వేధిస్తున్న మందుల కొరత..**

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో సర్కారు దవాఖానల్లో మందుల కొరత వేధిస్తున్నది. వీటిపై వైద్యసిబ్బంది స్పందించడం లేదు. మందులు, సూదుల కోసం బయటకు వెళ్లాల్సి వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ జ్వరాలకు మాత్రమే మందులు ఇస్తుండగా..ముఖ్యమైన వాటికి మాత్రం చీటీలు రాసి బయట తెచ్చుకోవాల్సిందేనని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ల్యాబ్ సేవలకు ఒక్కో రోగిని రెండు, మూడు రోజులు తిప్పించుకుంటున్నారు. దీంతో వివిధ గ్రామాల నుంచి వచ్చే బాధితులకు కష్టంగా మారుతున్నది.



### రిపోర్టులకు మూడు రోజులైతున్నది..

దమ్ము, ఆయాసం వస్తుందని వనపర్తి జిల్లా దవాఖానకు సోమవారం వచ్చాను. మూడు రకాల పరీక్షలు చేశారు. కానీ రిపోర్టులు ఇవ్వలేదు. మంగళవారం వెళ్తే రెండు రిపోర్టులు మాత్రమే ఇచ్చి మళ్లీ రమ్మన్నారు. మందులు కూడా కొన్నే ఇస్తున్నారు. మరికొన్నింటిని బయట దుకాణాల్లో తెచ్చుకోవాలని చెబుతున్నారు. రిపోర్టులు అదేరోజు ఇస్తే మాలాంటి వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఒక్కదాని కోసం రోజుల తరబడి తిరగాలంటే ఎలా. చేసే వైద్యం ఏదో ఒక్క రోజే చేస్తే బాగుంటుంది. ఈ తిరుగుడుతోనే పెద్ద బాధ ఉన్నది.

*- బాలకిష్టమ్మ, పామిరెడ్డిపల్లి, పెద్దమందడి మండలం, వనపర్తి జిల్లా*

### వనపర్తి జిల్లా దవాఖానలో విభాగాల వారీగా వివరాలు..

| విభాగం | మొత్తం పోస్టులు | ఉన్న వారు | ఖాళీలు |
|---|---|---|---|
| ప్రొఫెసర్లు | 21 | 12 | 9 |
| అసోసియేట్ ప్రొఫెసర్లు | 23 | 10 | 13 |
| అసిస్టెంట్ ప్రొఫెసర్లు | 123 | 42 | 81 |
| సివిల్‌సర్జన్స్ ఆర్‌ఎంవో | 1 | 0 | 1 |
| అసిస్టెంట్ సివిల్‌సర్జన్స్ ఆర్‌ఎంవో | 8 | 1 | 7 |
| ఫార్మసీ సూపర్‌వైజర్లు | 2 | 0 | 2 |
| ఫార్మసిస్ట్లు | 12 | 0 | 12 |
| సీఎంవోలు | 10 | 0 | 10 |
| ల్యాబ్ టెక్నీషియన్లు | 18 | 0 | 18 |
| **మొత్తం** | **218** | **65** | **153** |

### జాగ్రత్తలు తీసుకుంటున్నాం..



దవాఖానలో వైద్యులు, సిబ్బంది పోస్టులు ఖాళీలున్నప్పటికీ ప్రతి రోగికీ సరైన వైద్యం అందిస్తున్నాం. ఖాళీలను ప్రభుత్వపరంగా భర్తీ చేయాలి. ఉన్న సిబ్బందితో ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. విషజ్వరాలు పెరుగుతున్నాయి. దవాఖానలో రోగులకు సరిపడా మందులు, సూదులు ఉన్నాయి. జిల్లా దవాఖానలో చికిత్సకు ఎలాంటి ఇబ్బందులు లేవు.

*- శివ ప్రసాద్, ఆర్‌ఎంవో, వనపర్తి జిల్లా దవాఖాన*

### పేరుకే పెద్ద దవాఖానలు

- వైద్యశాలల్లో సమస్యల తాండవం
- సరిపడా లేని డాక్టర్లు, సిబ్బంది
- అందుబాటులో లేని మందులు
- స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, మిషన్లు నిల్
- ఓపీ సమయంలో రోగుల బారులు
- 'నమస్తే' విజిట్‌లో వెలుగులోకి సమస్యలు

## పెద్దాసుపత్రిలో సమస్యలెన్నో!

నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : జిల్లా దవాఖానగా మారిన నాగర్‌కర్నూల్‌లో స్పెషలిస్టు వైద్యులు ఫుల్‌గా ఉన్నా ఆశించిన స్థాయిలో వైద్యం అందని ద్రాక్షగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. 2016లో జిల్లాగా ఏర్పడటంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏరియా దవాఖాన స్థాయిని 330 పడకలకు పెంచి జిల్లా వైద్యశాలగా మార్చింది. దీంతో రోజురోజుకూ ఇక్కడికి వైద్యం కోసం వచ్చే పేదల సంఖ్య పెరుగుతూనే వస్తుండగా.. అదే స్థాయిలో సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో ఆశించిన మేర పేదలకు వైద్య సేవలు అందడం లేదన్న అపవాదు మూటగట్టుకున్నది.

**ఓపీ కోసం రోగులకు కష్టాలే..**

నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన నాలుగు నియోజకవర్గాల్లోని ముఖ్యంగా నల్లమల చెంచులు, ఇతర పేదలకు ప్రాణాలు పోసే ఆలయం. ఈ దవాఖాన జిల్లాస్థాయికి మారి ప్రత్యేక వైద్యనిపుణులు వచ్చి సేవలందిస్తున్నారు. ప్రస్తుతం 70 మంది వరకు ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యులు, 343 మంది నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గతంలో 600 నుంచి 700 వరకు ఉన్న ఓపీ ఇప్పుడు 1000కి దాటుతోంది. ఈ క్రమంలో ప్రస్తుతం దవాఖానలో అందుతున్న సేవలు, వచ్చే ఓపీకి భవనం సరిపోవడం లేదు. ఓపీ ఎంట్రీ చేయించుకోవాలంటే రోగులకు కష్టాలు తప్పడం లేదు. పెద్ద సంఖ్యలో బారులుదీరి పేర్లు నమోదు చేయించుకునేందుకు గుమికూడుతున్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులకు ఓపీ రాయించుకోవడం సమస్యగా మారింది. ఇక మంగళ, బుధవారాల్లో స్కానింగ్‌లు, పరీక్షల కోసం వచ్చే గర్భిణులు సైతం ఇక్కట్లు పడుతున్నారు. దవాఖాన ఆవరణలో స్కానింగ్‌కు పేర్లు నమోదు చేయించుకుంటున్నారు. ఇక దవాఖానలో శానిటేషన్ ఏజెన్సీదారు సరిగ్గా వేతనాలు ఇవ్వకపోవడం, కోర్టులో ఏజెన్సీ వ్యవహారం ఉండటంతో పారిశుధ్య సిబ్బంది తరచూ ఆందోళనల బాట పడుతున్నారు. అదనపు బెడ్ల కోసం లేఖలు రాస్తూ రాగా ఇటీవలే ప్రభుత్వం 5 బెడ్లకు అదనంగా మరో 5 బెడ్లను మంజూరు చేసింది. మంచాలతోపాటు పరికరాలనూ సిద్ధంగా ఉంచారు. ప్రారంభం కోసం ప్రజాప్రతినిధుల సమయం కోసం వైద్యాధికారులు ఎదురు చూస్తున్నారు. దవాఖానలో కొన్ని రోజుల్లో రోగుల సంఖ్య తక్కువగా ఉంటుండగా ఒక్కోసారి అధిక సంఖ్యలో వస్తున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడు ఈ సమస్య ఎదురవుతుంది. అప్పుడు అందరికీ మంచాలు అందించలేకపోతున్నారు. వంద మంది రోగుల్లో సాధారణంగా 50 మంది వరకు ఇన్ పేషెంట్లుగా ఉంటున్నారు. ఇటీవలి వర్షాకాలంలో అధికంగా డయేరియా, డెంగీ, వైరల్ ఫీవర్, కుక్క, పాము కాట్లకు చికిత్స కోసం వస్తున్నారు. దవాఖానలో ఐసీయూ కేంద్రంలో రాత్రివేళ వచ్చే అత్యవసర చికిత్స బాధితులను అధికంగా రెఫరల్ పంపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక దవాఖాన ముఖద్వారంగా కనిపించే లిఫ్ట్ దిష్టిబొమ్మలా మారింది. లిఫ్ట్ ఉందన్నది అలంకారప్రాయంగా మారింది. రెండో అంతస్తుకు వెళ్లేందుకు రోగులు, వృద్ధులు మెట్లు ఎక్కుతున్నారు. వైద్యులు ఐదు రోజులకు మందులు రాసిస్తే ఫార్మసీలో మాత్రం ఒకట్రెండు రోజులకు సరిపడా మాత్రలనే ఇస్తున్నారు. ఇదేమిటని అడిగితే 'స్టాక్ లేదు.. మళ్లీ రేపు రండి ఇస్తాం' అం టున్నారని రోగులు వాపోతున్నారు. ఈ సమస్యలు తీరాలంటే నూతన భవనం నిర్మించాల్సి ఉంది.





నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్, రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు

### నిరుపయోగంగా యంత్రాలు

దవాఖానలో అధునాతన సీటీ స్కానింగ్ యంత్రం వచ్చి నెలలు గడుస్తున్నా టెక్నీషియన్ రాక సేవలు ప్రారంభించలేదు. ఆరేండ్లుగా డయాలసిస్ కేంద్రం నడుస్తోంది. దవాఖాన థియేటర్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కరోనా సమయంలో రూ.లక్షలతో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. అయితే, జిల్లా దవాఖానకు లిక్విడ్ ఆక్సిజన్ సిలిండర్ ప్లాంట్ కావాల్సి ఉన్నది. దీనికోసం వైద్యాధికారులు ప్రతిపాదనలు పంపారు.

### సరైన వైద్యమందేలా చర్యలు..



నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు వచ్చే రోగులందరికీ పూర్తిస్థాయిలో వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటాం. సీటీ స్కాన్, ఐదు కొత్త డయాలసిస్ బెడ్లను త్వరలో ప్రారంభింపజేస్తాం. మందుల కొరత లేదు. డాక్టర్ బదిలీపై వెళ్లడంతో ఒక్క ఆప్తాలమిక్ సేవలు తప్పా అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తున్నాం. వైద్యులు, సిబ్బంది రోగులతో మంచిగా వ్యవహరించడంతోపాటు సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాను.. లిఫ్ట్, ఆక్సిజన్ ప్లాంట్, ఆపరేషన్ థియేటర్, ఇతర సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నాం. ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి వచ్చిన వెంటనే స్పందిస్తూ పరిష్కరిస్తున్నాం.

*- డాక్టర్ రఘు, సూపరింటెండెంట్, నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన*

- గణనీయంగా పెరుగుతున్న పేషెంట్లు..
- ఓపీకి భవనం సరిపోక రోగుల బారులు
- టెక్నీషియన్ లేక అందని సీటీ స్కాన్ సేవలు
- పనిచేయని లిఫ్ట్‌తో వృద్ధుల పాట్లు
- నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్
- పెరుగుతున్న సీజనల్ కేసులు
- రెండు, నాలుగు మాత్రలతోనే సరి

### కేసీఆర్ ప్రభుత్వంలో నూతన భవనం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నూతన భవనం కోసం నిధులు మంజూరుకాగా గత మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చొరవతో మెడికల్ కాలేజీ నిర్మాణం, దవాఖానకు స్థల సేకరణ జరిగింది. అయితే ఇప్పటికీ నూతన భవన పనులు ముందుకు కదలడంలేదు. ఈ దవాఖాన స్థాయిని 600 పడకలకు పెంచుతున్నట్లుగా తాజా ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి చేసిన ప్రకటన జీవో రావాల్సి ఉన్నది. ప్రస్తుతం దవాఖానకు వస్తున్న రోగులు, అందే వైద్యానికి నూతన ఆధునిక భవనం కావాల్సి ఉన్నది. అలాగే వైద్యశాల అభివృద్ధి కమిటీ కొన్నేళ్ల నుంచి ఏర్పాటు చేయలేదు. ఈ కమిటీ ఉంటే దవాఖానలో సమస్యలను చర్చించి, పరిష్కారం కోసం చర్యలకు ఆస్కారం ఉండేది. దీనివల్ల పూర్తిస్థాయిలో వైద్యాధికారులపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కరువైంది. ఇక్కడ సమస్యలను బయటకు రాకుండా చూస్తారన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.



డాక్టర్ల పర్యవేక్షణ లేకుండానే రోగికి చికిత్స చేస్తున్న మెడికో

- ఔషధాలు లేక రోగుల ఇక్కట్లు

## స్ట్రెచర్లు, మందులు కరువు





వీల్‌చైర్లు లేక నడుచుకుంటూ వెళ్తున్న రోగి, మందులను వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 : ప్రభుత్వ దవాఖానలపై ప్రభుత్వ పర్యవేక్షణ కరువైంది. దీంతో డాక్టర్లు ఉండరు.. అందుబాటులో మందులు లేవన్నట్లు పరిస్థితి తయారైంది. రోగులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖాన పేరొందింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రోగులకు అన్ని రకాలు సేవలు ఇక్కడ అందేవి. కానీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే పరిస్థితి తారుమారైంది. రోగుల నాడి పట్టి చూసే డాక్టర్లే కరువయ్యారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం 150 మంది డాక్టర్లు, హౌస్ సర్జన్లు 100 మందితో పాటు 250 మంది నర్సింగ్, 150 మంది శానిటేషన్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అత్యవసర రోగులతోపాటు నిత్యం పెద్దఎత్తున తరలివస్తుంటారు. వార్డులో డాక్టర్లు అందుబాటులో లేకుండా పేషెంట్ పరిస్థితి తెలుసుకొని జూనియర్ డాక్టర్లకు ఫోన్‌లో సూచనలు అందిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, గుండె, నరాల డాక్టర్లు లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ దవాఖానలకు వెళ్లాల్సిందే. ప్రధానంగా రోగులకు వీల్ చైర్లు, స్ట్రెచర్లు లేక రోగులు, వారి వెంట వచ్చే సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీల్‌చైర్లను వార్డు బాయ్స్ మందులు తీసుకురావడానికి, నీటిని తెచ్చేందుకు వినియోగిస్తున్నారే తప్పా రోగుల కోసం వాడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ఆయా పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం అందక ఈ దవాఖానను ఆశ్రయిస్తున్నారు. దీంతో రోగుల సంఖ్య పెరుగుతున్నది. నిత్యం ఎక్కువ మంది రోగులు వస్తుండడంతో వైద్యులు హడావుడిగా చికిత్స చేస్తూ చేతులు దులుపుకొంటున్నారని రోగులు వాపోతున్నారు. దీనికి తోడు ఫార్మసీలో మందుల కొరత ఏర్పడింది. ఆరునెలలుగా మెడ నొప్పులు ఉన్నాయని పెద్దాసుపత్రికి వస్తే పరీక్షించిన వైద్యులు మందులు రాశారని పాలమూరుకు చెందిన శాంతమ్మ తెలిపింది. అయితే దవాఖానలో మందులు తీసుకునేందుకు వెళ్తే నొప్పుల గోలీలు లేవని బయట తీసుకోవాలని ఫార్మసిస్టులు ఉచిత సలహా ఇచ్చారని వాపోయింది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని మందులు అందుబాటులో ఉంచడంతోపాటు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



టీహబ్‌లో పాడైన యంత్రాన్ని పరిశీలిస్తున్న టెక్నీషియన్



ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడంతో వేచి ఉన్న రోగులు

## రోగులు ఫుల్.. మందులు నిల్



కుర్చీలు లేకపోవడంతో నేలపై పడుకున్న రోగులు

జడ్చర్ల, ఆగస్టు 13 : జడ్చర్ల వంద పడకల దవాఖానలో 30 పడకల వైద్యసేవల మేరకే అందుతున్నాయి. పూర్తి స్థాయిలో స్టాఫ్ అప్‌గ్రేడ్ కాలేదు. ఈ దవాఖానకు నిత్యం 500-600 వరకు ఓపీ, 40 మందికి పైగా ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. స్పెషలైజేషన్ డాక్టర్లు లేకపోవడంతో ఉన్న వారితోనే వైద్యం అందిస్తున్నారు. అన్ని విభాగాల్లో కలిపి 35 మంది వైద్యులకుగానూ కేవలం 10 మంది మాత్రమే ఉన్నారు. 30 నుంచి వంద పడకలకు అప్‌గ్రేడ్ చేసినా సరైన సిబ్బంది, సరిపడా పరికరాలు ఏర్పాటు చేయలేదు. అలాగే యాంటిబయాటిక్‌తోపాటు కొన్నిరకాల పెయిన్‌కిల్లర్ మందులు అందుబాటులో లేకపోవడంతో బయట తీసుకోవాల్సి వస్తున్నది. డాక్టర్లు రాసిన పరీక్షల కోసం వెళ్తే ల్యాబ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. కూర్చోవడానికి బెంచీలు కూడా లేవు.

## సమయపాలనేదీ?

- ఉదయం 10 గంటలైనా విధులకు హాజరుకాని డాక్టర్లు
- వెనుకేసుకొస్తున్న అధికారులు
- గద్వాలలో రోగులకు తప్పని ఇక్కట్లు

గద్వాల, ఆగస్టు 13 : వైద్యుల సమయపాలన పాటించకపోవడంతో ప్రభుత్వ దవాఖాన వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటినా కొందరు డాక్టర్లు విధులు హాజరు కాకపోవడంతో రోగులకు సరైన వైద్యం సమయానికి అందడం లేదు. జిల్లా కేంద్రంలో ఉన్న వైద్యవిధాన పరిషత్ దవాఖాన ప్రస్తుతం జిల్లా దవాఖానగా రూపాంతరం చెందింది. అందుకు అవసరమైన సౌకర్యాలు కేసీఆర్ సర్కారు కల్పించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న సౌకర్యాలను వినియోగించుకోలేని పరిస్థితి నెలకొన్నది. ప్రతి రోజూ 600 నుంచి 700 వరకు ఓపీ ఉంటుంది. 100 నుంచి 150 దాక ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. అయితే ప్రస్తుతం జిల్లా దవాఖానగా ఏర్పాటు కావడంతోపాటు త్వరలో మెడికల్ కళాశాల ప్రారంభం అవుతుండడంతో మెడికల్ కళాశాల కోసం అవరమైన సిబ్బందిని 42 మందిని ప్రభుత్వం నియమించింది. వీరితోపాటు ప్రస్తుత దవాఖానలో 30 మంది నర్సింగ్ స్టాఫ్ ఉండగా మెడికల్ కళాశాల కోసం మరో 56 మందిని తీసుకున్నారు. అయితే తీసుకున్న వైద్య సిబ్బందిలో సగ భాగం వైద్యులు సరైన సమయానికి విధులకు రాక పోవడంతో రోగులు డాక్టర్ల కోసం ఎదురు చూస్తున్నారు. మంగళవారం నమస్తే తెలంగాణ జిల్లా దవాఖానను ఉదయం 10 గంటలకు సందర్శించిన సమయంలో సూపరింటెండెంట్, ఆర్‌ఎం వారి స్థానాల్లో లేకపోవడం గమనార్హం. వారే సరైన సమయానికి రాకుంటే కింది స్థాయి డాక్టర్లు, సిబ్బంది ఎలా హాజరవుతారనేది రోగుల ప్రశ్న.

**పత్తాలేని డాక్టర్లు..**

ఉదయం 9:30గంటల తర్వాత డాక్టర్ల గదులను పరిశీలిస్తే మానసిక చికిత్స విభాగం, జనరల్ సర్జరీ, దంతవిభాగం, ఆప్తామాలజీ డాక్టర్లు విధులకు హాజరు కాలేదు. మందుల స్టోర్ గది తెరవలేదు. అయితే నర్సులు అందుబాటులో ఉండడంతో రోగులకు కొంత ఉపశమనం కలిగించే అంశం. రోగులకు పరీక్షలు దవాఖానల్లో చేస్తున్నా.. రిజల్ట్ ఆలస్యం అవుతున్నది. మందులు అందుబాటులో ఉన్నా రోగులకు అరకొర మందులు మాత్రమే ఇస్తున్నారు.



రోగుల పడిగాపులు





గద్వాల దవాఖానలోని జనరల్ సర్జన్‌లో ఖాళీ కుర్చీలు, దంత విభాగంలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

### కొత్త కదా ఆలస్యం అవుతుంది..



ఈ మధ్యనే మెడికల్ కళాశాల కోసం అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్స్‌ను నియమించాం. నియమించిన వైద్య సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి వస్తుండడం వల్ల కొంత ఆలస్యం అవుతుంది. అయిన రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించిన తర్వాతే వారు వెళ్తున్నారు. కొత్త కదా కొంత ఆలస్యమవుతుందని డాక్టర్లను వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేసింది.

*- డాక్టర్ పార్వతి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్*

### ఇబ్బందుల్లేకుండా వైద్య సేవలు



జిల్లా దవాఖానలో రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. రోగులకు అవసరమైన టెస్టులు, మందులు దవాఖానలో అందజేస్తున్నాం. ప్రతి రోజూ 60 దాకా ఎక్స్‌రేలు తీస్తున్నాం. డయాలిసిస్‌లో మొత్తం 94 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 12 బెడ్లు ఉన్నాయి. షిఫ్ట్ సిస్టం ద్వారా వారికి డయాలిసిస్ చేస్తున్నాం. డాక్టర్లు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటా.

*- డాక్టర్ వినోద్, సూపరింటెండెంట్*

## ఐదు బైక్‌లను ఢీకొట్టిన కారు

గద్వాల అర్బన్, ఆగస్టు 13 : ఓ కారు బీభత్సం సృష్టించగా.. తృటిలో పెనుప్రమాదం తప్పిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఓ వ్యక్తి తన కారును వెనక్కి తీసే క్రమంలో బ్రేక్ మీద పెట్టాల్సిన కాలు ఎక్స్‌లేటర్ మీద పెట్టడంతో ముందుకు వేగంగా దూసుకెళ్లింది. ఈ క్రమంలో కారు సమీపంలో పార్క్ చేసిన ఐదు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వాహనాలు మాత్రం దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు

## నూతన జీపీగా 'ఏవీఆర్ కాలనీ'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 13 : జిల్లాలో కొత్త పంచాయతీ ఏర్పడింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. భూత్పూరు మండలంలో కొత్తగా ఒక జీపీ ఏర్పడటంతో జిల్లాలో పంచాయతీల సంఖ్య 442కు చేరింది. ఇప్పుడున్న పంచాయతీలో జనాభా ఎక్కువగా ఉండటం అనుబంధ గ్రామాలకు కార్యాలయాలు దూరమవ్వడంతో ప్రజల నుంచి వినతులు వచ్చాయి. వీటిని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కొత్తగా భూత్పూరు మండలంలోని వెల్కిచర్ల తండా పంచాయతీ పరిధిలోని వెల్కిచర్ల-భట్టుపల్లి ప్రాంతాలను కలుపుకొని ఏవీఆర్‌కాలనీ పంచాయతీ 6 వార్డులతో ఏర్పాటైంది. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాలో వార్డుల సంఖ్య 3,844కు చేరింది.

## కొనసాగుతున్న జలవిద్యుదుత్పత్తి

ఆత్మకూరు, ఆగస్టు 13 : ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. సోమవారం అర్ధరాత్రికి ఎగువ జూరాలలో 4 యూనిట్లలో ఉత్పత్తి నిర్వహిసుండగా 2.646 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇప్పటి వరకు మొత్తంగా 6.787 మి.యూ ఉత్పత్తి జరిగింది. దిగువ జూరాలలో 5 యూనిట్లలో ఉత్పత్తి నిర్వహిస్తుండగా 3.2671 మి.యూ ఉత్పత్తి జరిగింది. మొత్తంగా 41.1380 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టిన పరిస్థితుల్లో ఎగువ జూరాల విద్యుత్‌కేంద్రంలో రెండు యూనిట్లను నిలిపివేసినట్లు ఎస్‌ఈ కల్లూరి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఏడాది లక్ష్యం మేరకు ఉత్పత్తి నిర్వహించేందుకు పూర్తి సన్నద్ధతతో కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు.